

## మహానాడులో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

**హైదరాబాద్,మే 27(జనం వార్త) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీ సీనియర్ నాయకులు, శ్రీ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు తాళికోట హరికృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాళికోట హరికృష్ణ, ఉమాశంకర్ గౌడ్, సాయి నాగార్జున, బ్రహ్మం చౌదరి,రమణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

### నేడు నాగారంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు.

నేడు నాగారం డివిజన్ పరిధిలోని సత్యనారాయణ కాలనీ రోడ్ నెంబర్ 1 లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద 13వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు నరగం ఉమాశంకర్ గౌడ్ తెలిపారు.

## సదా మీ సేవలో శ్రీ అను సేవా ట్రస్ట్

### చలివేంద్రాన్ని ప్రారంభించిన: నవీన్

**శేరిలింగంపల్లి,మే 27 (జనంవార్త) :** బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని శ్రీ అను సేవా ట్రస్ట్ ఫౌండర్ నవీన్ కుమార్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని శ్రీ అను సేవ ట్రస్ట్ హాఫీజ్పేట్ సౌజన్యంతో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పలు కాలనీలలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మియాపూర్ చెరువు దగ్గర ప్రతి మంగళవారం, శుక్రవారం రాగిజావ అందజేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ప్రతి రోజు ఒక కాలనీలో దోమల







తీవ్రతను గుర్తించి దోమల నివారణకు మస్కిటో స్ప్రే చేయడం చేయిస్తున్నామని ఫౌండర్స్ నవీన్ కుమార్, అనుపమ తెలిపారు. ఎండలు 40 డిగ్రీలు దాటడంతో వాహనదారులు ఎంత ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో శ్రీ అను ట్రస్టు ద్వారా ఆల్విన్ చౌరస్తాలో 2000 వాటర్ బాటిల్స్ వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు దాహం తీర్చడం జరిగిందని,ట్రస్టు ద్వారా విద్య,వైద్యం విషయంలో ప్రాముఖ్యత చూపుతున్నందున శ్రీ అను సేవా ట్రస్టుకు ప్రజల నుండి అశేష స్పందన లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకి గవర్నమెంట్ వచ్చి ఏదో చేస్తుంది అని చూడ కుండా ఇంకా పలు కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు మంచి చేయడంలో శ్రీ అను సేవా ట్రస్ట్ ముందు ఉంటుందని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామయ్య, జనప్రియ శివ,కృష్ణ, రామకృష్ణ,హరికృష్ణ, కరుణాకర్, శివ,పద్మజ, గీతా,రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్నల దిగుమతి వేగవంతం చేయాలి

### అధికారులను ఆదేశించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

**పెద్దపల్లి, మే 27 :** కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లోని మొక్కజొన్నల దిగుమతి గోదామును బుధవారం రోజున స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన గౌరవ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ-రమణ రావు. గోదాములో చెడిపోయిన 20 వేల గన్ని సంచులను తొలగించి మొక్కజొన్నల దిగుమతికి మరింత స్థలం కేటాయించాలని ఫోన్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఎమ్మెల్యే విజయరమణ రావు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డుకు వస్తున్న మొక్కజొన్నల దిగుమతి ప్రక్రియను అధికారులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదాములో నిరుపయోగంగా,చెడిపోయి ఉన్న సుమారు 20 వేల సంచులను వెంటనే అక్కడి నుండి తొలగించాలని,తద్వారా కొత్తగా వచ్చే మొక్కజొన్నల నిల్వకు మరింత స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో ఫోన్లో మాట్లాడి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రం రెడ్డి, సర్పంచ్ బంగారి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సదయ్య, సబ్బని రాజమల్లు గోలి సుధాకర్ మాదాసి సతీష్, శ్యామ్,కాంగ్రెస్ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తును చిదిమేస్తున్న ఇన్స్టాగ్రామ్

Instagram

**నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్ వంటి ఆన్లైన్ ప్లాట్ఫాంలు యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇన్స్టాగ్రామ్ మాయలో పడి చిన్న వయసులోనే పెద్ద నిర్ణయాలు తీసుకునే స్థితికి చేరుతున్న మైనర్లు, తమ భవిష్యత్తునే కాదు కుటుంబాల్ని కూడా ఆందోళనలోకి నెట్టేస్తున్నారు.**

- చాటింగ్‌తో స్టార్ట్ అయి చీటింగ్ తో ఎండ్ అవుతున్న పరిచయాలు
- యువతను అంధకారంలోకి నెట్టేస్తున్న ఆన్లైన్ చాటింగ్
- చిన్న వయసులోనే పెద్ద నిర్ణయాలకు దారి తీస్తున్న ఇన్స్టా ప్రభావం
- అవసరమైతే ప్రాణాలు తీసుకోవడానికి కూడా వెనకాడని తెగింపు
- తస్మాత్ జాగ్రత్త అంటున్న పోలీసులు

ఇన్స్టాగ్రామ్ మాయలో పడి చిన్న వయసులోనే పెద్ద నిర్ణయాలు తీసుకునే స్థితికి చేరుతున్న మైనర్లు, తమ భవిష్యత్తునే కాదు కుటుంబాల్ని కూడా ఆందోళనలోకి నెట్టేస్తున్నారు. యువతను అంధకారంలోకి నెట్టేస్తున్న డిజిటల్ ప్రపంచం ఎంత ప్రమాదకరమైందో రోజు రోజుకు కొన్ని కొన్ని సంఘటనలు చూస్తుంటే స్పష్టంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్ఫాంలలో ఫేక్ ఫోటోలు, ఫేక్ ఐడీలు సృష్టించడం చాలా సులభంగా మారింది. నిజమైన గుర్తింపు నిర్ధారణ లేకపోవడంతో, ఎవరైనా ఏ రూపంలోనైనా ఇతరులను మోసం చేసే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి. వయసు పరిమితులు, ప్రొఫైల్ వెరిఫికేషన్ వ్యవస్థలు బలహీనంగా ఉండటంతో మైనర్లు ఈ మాయలో సులభంగా చిక్కుకుంటున్నారు. ఇలాంటి అనియంత్రిత పరిస్థితుల్లో ఆన్లైన్ చాటింగ్ ద్వారా భావోద్వేగంగా ప్రభావితం చేయడం, తప్పుదోవ పట్టించడం సర్వసాధారణంగా మారుతోంది. సరైన నియంత్రణ, కఠిన పర్యవేక్షణ లేకపోతే సోషల్ మీడియా యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతుందనే ఆందోళనను ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.







### ఇన్స్టాగ్రామ్ లో పరిచయమై మోసపోయిన సంఘటనలు :

- ఈ మధ్యకాలంలో ఇన్స్టాగ్రామ్ లో యువతికి పరిచయమైన ఓ యువకుడు రెండు నెలల చాటింగ్ అనంతరం ఫంక్షన్ కి వెళ్ళొస్తా నాకు నీ మెడలో ఉన్న బంగారు గొలుసు ఇవ్వమని అడగగా ఆ యువకుడుని నమ్మిన యువతి ఆ బంగారు గొలుసు ఇవ్వగా తీసుకుని వెళ్ళిపోయాడు. అనంతరం బంగారు గొలుసు కోసం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడం ఇన్స్టాగ్రామ్ అకౌంట్ ఐడి బ్లాక్ చేయడంతో మోసపోయానని గ్రహించిన సదరు యువతి ఇంట్లో చెప్పుకోలేక మానసిక వేదన అనుభవించింది.
- పెళ్లయిన ఓ మహిళకు ఒక యువకుడు ఇన్స్టాగ్రామ్ లో పరిచయం కాగా సుమారు మూడు నెలల పాటు చాటింగ్ చేసుకున్న అనంతరం మనం ఒకసారి కలుద్దామని సదరు యువకుడు ఆ మహిళకు చెప్పగా సరేనని ఒప్పుకున్న సదరు మహిళ యువకుడు చెప్పిన హైదరాబాద్ నగరంలోని ఒక హోటల్ కి వెళ్ళింది. అనంతరం ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును గమనించిన సదరు యువకుడు స్థానికంగా ఉండే ఓ థియేటర్లో మూవీ చూడడానికి వెళ్లారు. సినిమా చూస్తున్న సమయంలో నీ మెడలో ఉన్న పుస్తెలతాడును ఎవరైనా చూస్తే నీకే ఇబ్బంది అవుతుంది తీసేసి నీ హ్యాండ్ బ్యాగ్ లో పెట్టుకుని వాష్ రూమ్ వెళ్లి మొహం కడుక్కొని రాపో అని చెప్పగా ఆ యువకుడి మాటలు నమ్మిన ఆ వివాహిత వాష్ రూమ్ కి వెళ్ళగా హ్యాండ్ బ్యాగ్ లో ఉన్న పుస్తెలతాడు తీసుకొని వెళ్లిపోయాడు. మోసపోయానని గ్రహించిన సదరు వివాహిత ఇంట్లో చెప్పుకోలేక, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయలేక అనారోగ్యం పాలైంది.

### ఆన్లైన్ చాటింగ్ మాయలో మైనర్లు

ఆన్లైన్ చాటింగ్ మాయలో మైనర్లు చిక్కుకుని, చిన్న వయసులోనే భావోద్వేగ నిర్ణయాలు తీసుకునే పరిస్థితికి చేరుతున్నారు. ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్ఫాంలలో ఏర్పడుతున్న పరిచయాలు స్నేహం పేరుతో మొదలై, కుటుంబనియంత్రణను దాటే స్థాయికి తీసుకెళ్తున్నాయి. అర్ధరాత్రి ఇంటిని వదిలి వెళ్లడం, మానసిక ఒత్తిడితో ఆత్మహత్య బెదిరింపులు చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు మైనర్ల భద్రత, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని, తల్లిదండ్రుల అప్రమత్తత మరియు నిరంతర పర్యవేక్షణ అత్యవసరమని ఈ ఘటన స్పష్టంగా హెచ్చరిస్తోంది.

### లోపించిన తల్లిదండ్రుల పర్యవేక్షణ

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడం కూడా ఇలాంటి ఘటనలకు ప్రధాన కారణంగా మారుతోంది. మొబైల్ ఫోన్ చేతిలో ఉన్నప్పుడే పిల్లలు సురక్షితంగా ఉన్నారని భావించడం, వారి ఆన్లైన్ కార్యకలాపాలపై సరైన అవగాహన లేకపోవడం ప్రమాదాలకు దారి తీస్తోంది. పిల్లలు ఎవరితో మాట్లాడుతున్నారు. ఎలాంటి చాటింగ్ చేస్తున్నారు. ఎలాంటి భావోద్వేగ మార్పులు వస్తున్నాయో గమనించకపోవడం వల్ల వారు మానసికంగా ఒంటరిగా మారుతున్నారు. ఈ లోటును సోషల్ మీడియా పూర్తిగా వినియోగించుకుంటూ, చిన్న వయసులోనే పెద్ద నిర్ణయాలు తీసుకునే స్థితికి మైనర్లను నెట్టేస్తోంది. పిల్లల భద్రత కోసం తల్లిదండ్రుల చురుకైన పర్యవేక్షణ, నిరంతర సంభాషణ అత్యవసరమని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

